

# రాబడి

# మదుపుతోనే గెలుపు




## ద్రవ్యసమీక్షపైనే..

**దేశీయ** స్టాక్ మార్కెట్లు లాభాలకు దూరంగా ట్రేడ్ అవుతున్నాయి. గతకొద్ది రోజులుగా మదుపరులు పెట్టుబడులకు సంశయిస్తున్నారు. ఫలితంగా సూచీలు నష్టాలకే పరిమితం కావాల్సి వస్తున్నది. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే గత వారం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 270.07 పాయింట్లు లేదా 0.33 శాతం పడిపోయి 81,451.01 దగ్గర నిలిచింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 102.45 పాయింట్లు లేదా 0.41 శాతం కోల్పోయి 24,750.70 వద్ద స్థిరపడింది. ఈ వారం కూడా సూచీలు పడుతూలేస్తూ పయనించే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. అయితే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2025-26)గాను రెండో ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షను ఈ నెల 4-6 తేదీల్లో నిర్వహించనున్నది. దీంతో వడ్డీరేట్లపై ఆర్బీఐ నిర్ణయాల ఆధారంగా మార్కెట్లు ట్రేడ్ అయ్యే వీలున్నదని చెప్పవచ్చు. ఈ ఏడాది మొదలు ఇప్పటిదాకా జరిగిన రెండు ద్రవ్యసమీక్షల్లో రెపోరేటును ఆర్బీఐ అర శాతం తగ్గించిన విషయం తెలిసిందే. రాబోయే ద్రవ్యసమీక్షలోనూ మరో పావు శాతం తగ్గవచ్చన్న అంచనాలున్నాయి. ఇదే జరిగితే బ్యాంకింగ్, ఆటో, రియల్టీ, ఇతరత్రా కన్స్యూమర్ డ్యూరబుల్స్ షేర్లు ఆకర్షణీయం కానున్నాయి. సూచీలు తిరిగి లాభాలను సంతరించుకోవచ్చు. ఇక ఎప్పట్లాగే డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ, గ్లోబల్ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులు, విదేశీ సంస్థాగత మదుపరుల (ఎఫ్ఐఐ) పెట్టుబడులు, ముడి చమురు ధరలు దేశీయ మార్కెట్లను నిర్దేశించనున్నాయి. అయితే అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 24,300 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 24,000 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. కానీ సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 25,300-25,500 స్థాయికి వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

మార్కెట్ పల్స్

**గమనిక..**

*స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదొడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.*



**నేడు** మనం చేసే పొదుపు, పెట్టుబడులే రేపు మన భవిష్యత్తుకు రక్షణనిస్తాయి. దీర్ఘకాలంలో ఆర్థిక క్రమశిక్షణకు ఇవే సోపానాలు. ముఖ్యంగా మన ఆర్థిక లక్ష్యాల సాధనకు పెట్టుబడులే కీలకం. తెలివైన నిర్ణయాలతో చక్కని రాబడులను అందుకోవచ్చు. మరి ఇందుకున్న అవకాశాలు ఏమిటి? ఎలా ముందుకెళ్తే వాటిని సద్వినియోగం చేసుకోవచ్చు?

### డైరెక్ట్ ఈక్విటీ

స్టాక్స్‌లో పెట్టే పెట్టుబడులనే డైరెక్ట్ ఈక్విటీ అంటారు. ఏదైనా కంపెనీ షేర్లను మీరు కొన్నట్టైతే.. అందులో మీకు పాక్షికంగా యాజమాన్య హక్కులు వచ్చినట్టే. ఇక ఈ పెట్టుబడులకు స్టాక్ ఎక్స్ఛేంజీలు వేదికలవుతాయి. డీమ్యాట్ ఖాతాల ద్వారా షేర్ల క్రయవిక్రయాలను చేయవచ్చు. అయితే స్టాక్ మార్కెట్ పెట్టుబడులు అనేక అంశాలకు ప్రభావితమై ఉంటాయి. కాబట్టి ఈ ఇన్వెస్ట్‌మెంట్స్ రిస్కులతో ముడిపడి ఉంటాయి. అందుకే మార్కెట్ పరిజ్ఞానం తప్పనిసరిగా ఉండాలి.

### మ్యూచువల్ ఫండ్స్

మ్యూచువల్ ఫండ్స్ సంస్థల గురించి నేటి తరం ఇన్వెస్టర్లకు ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. మన పెట్టుబడులను స్టాక్ మార్కెట్లతోపాటు డెట్, హైబ్రిడ్ ఫండ్స్ తదితర రకరకాల సాధనాల్లో మదుపు చేస్తాయి. దీర్ఘకాలిక మదుపునకు మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడులు లాభదాయకం. సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ల (సిప్)తో ప్రారంభం బాగుంటుంది. అయితే ఇవి కూడా రిస్క్‌తో కూడుకున్నవే. సంబంధిత డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదివి ముందుకెళ్లాలి.

### ఫిక్స్‌డ్ డిపాజిట్లు

బ్యాంకులు, ఇతర ఫైనాన్షియల్ సంస్థలు ఫిక్స్‌డ్ డిపాజిట్ల (ఎఫ్‌డీ)ను ఆఫర్ చేస్తాయి. ఇవి సురక్షిత పెట్టుబడులు అని చెప్పవచ్చు. రిజర్వ్ బ్యాంక్ వడ్డీరేట్ల ఆధారంగా డిపాజిటర్లకు వడ్డీ అదాయం ఉంటుంది. పన్ను మినహాయింపులు లభిస్తాయి. ప్రధానంగా సీనియర్ సిటిజన్లకు అనువైనవి. వీటికి లాకిన్ పీరియడ్ ఉంటుంది.

### రికరింగ్ డిపాజిట్లు

రికరింగ్ డిపాజిట్ (ఆర్‌డీ) కూడా మరో ఫిక్స్‌డ్ టెన్యూర్ ఇన్వెస్ట్‌మెంట్. బ్యాంకులు, పోస్టాఫీసుల్లో ఈ పెట్టుబడులకు అవకాశం ఉంటుంది. నెలనెలా చిన్నచిన్న మొత్తాలతో మదుపునకు వీలుంటుంది. పెట్టుబడికి రక్షణ, గ్యారంటీడ్ ఇన్‌కమ్ వీటి సొంతం.

### పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్

ఇదో దీర్ఘకాలిక పన్ను ఆదా పెట్టుబడి. పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్)కు లాకిన్ పీరియడ్ 15 ఏండ్లు. కేంద్ర ప్రభుత్వం హామీ ఉంటుంది. ప్రతీ మూడు నెలలకోసారి వడ్డీరేట్లను కేంద్రం నిర్ణయించి ప్రకటిస్తుంది.

### ఎంప్లాయీ ప్రావిడెంట్ ఫండ్

ఎంప్లాయీ ప్రావిడెంట్ ఫండ్ (ఈపీఎఫ్).. వేతన జీవులకు ప్రయోజనకరంగా ఉంటుంది. ఆదాయ పన్ను (ఐటీ) చట్టంలోని సెక్షన్ 80సీ కింద పన్ను మినహాయింపులు లభిస్తాయి. ఇందులో జమయ్యే నిధులకు అధిక వడ్డీరేటు లభిస్తుంది. కాబట్టి వీటిని ఉపసంహరించుకోకుండా కాపాడుకోవడం కూడా మంచి పెట్టుబడి కిందకే వస్తుంది.

### నేషనల్ పెన్షన్ సిస్టమ్

పీపీఎఫ్, ఈపీఎఫ్‌లతో పోల్చితే నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్)లో పెట్టుబడిదారులు అధిక రాబడులను పొందవచ్చు. పన్ను ప్రోత్సాహకాలుంటాయి. అయితే ఈ పథకాన్ని ఎంచుకొంటే రిటైర్మెంట్‌దాకా లాకిన్ పీరియడ్ ఉంటుంది. అయినప్పటికీ నిబంధనలకు లోబడి 40 శాతం వరకు నిధులను వెనక్కి తీసుకోవచ్చు. కొంతమంది ప్రభుత్వ ఉద్యోగులకు ఎన్‌పీఎస్ సబ్‌స్క్రిప్షన్ తప్పనిసరిగా ఉన్నది.

## కొంచెం కొత్తగా ఆలోచిద్దాం..

**రోజులు** మారిపోయాయి. ఒకప్పటితో పోల్చితే మదుపరులకు పెట్టుబడికున్న అవకాశాలూ పెరిగిపోయాయి. సంప్రదాయ పెట్టుబడుల స్థానంలో ఇప్పుడు హైటెక్ పెట్టుబడులు వస్తున్నాయి. నేటి తరం వీటిపై మరింతగా దృష్టి సారిస్తే గొప్ప ప్రయోజనాలనే అందుకోవచ్చు. మరి వాటిలో..

**ఏఐ ఆధారిత ఈటీఎఫ్‌లు**

ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్)ల్లో పెట్టుబడుల ద్వారా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), రోబోటిక్స్, ఆటోమేషన్ తదితర నయా టెక్నాలజీ ఇన్వెస్ట్‌మెంట్స్ వైపునకు అడుగులు వేయవచ్చు. ఇప్పుడున్న పరిస్థితుల్లో భవిష్యత్తు అంతా వీటిదేనని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. కాబట్టి ఏఐ ఫోకస్డ్ ఈటీఎఫ్‌లను ఎంచుకోవడం ఉత్తమమే.

**క్రిప్టో సిప్స్**

బిట్‌కాయిన్ వంటి ప్రధాన క్రిప్టోకరెన్సీల్లో సిస్టమ్యాటిక్ మంత్లీ ఇన్వెస్ట్‌మెంట్స్ (సిప్).. యువతరానికి బాగా కలిసిరాగలవని మెజారిటీ నిపుణుల అంచనా. దీర్ఘకాలంలో సంపద సృష్టికి ఇవి దోహదం చేయగలవు.

**గ్రీన్ బాండ్లు, డిజిటల్ గోల్డ్**

రెన్యువబుల్ ఎనర్జీ, సస్టెయినబుల్ ప్రాజెక్టుల్లో ఫండింగ్ చేసే గ్రీన్ బాండ్లనూ మదుపరులు తమ పెట్టుబడులకు ఎంచుకోవచ్చు. అలాగే యూపీఐ యాప్స్ ద్వారా సూక్ష్మ పెట్టుబడులనూ అనుసరించవచ్చు. పీర్-టు-పీర్ లెండింగ్ సాధనాలనూ పరిశీలించవచ్చు.






తెలంగాణ ఉద్యమంలో బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్

## తెలంగాణ ఉద్యమకారుడు స్ఫూర్తిదాయకం

ఉట్నూర్ రూరల్, జూన్ 1 : తెలంగాణ రాష్ట్ర సాధనలో మలి దశ ఉద్యమాలలో ఎంతో మంది పోరాటాలు చేశారు. అందులో కొంత మందిని తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గుర్తు చేసుకుందాం. ఉట్నూర్ మండలంలో ఉద్యమ సమయంలో కీలకపాత్ర పోషించిన కొందరిలో ధరణి రాజేశ్ ఒకరు. భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడిగా, సామజిక కార్యకర్తగా కీలక పాత్ర పోషించాడు. ఉట్నూర్ పట్టణ విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించిన ధరణి రాజేశ్ తన భవిష్యత్‌ను లెక్క చేయకుండా అరెస్టులు, కేసులను భయపకుండా పోరాటాలలో పాల్గొన్నారు. రాష్ట్ర సాధనలో చురుకుగా పాల్గొన్నారు. ధరణి రాజేశ్ పోరాట స్ఫూర్తిని గుర్తించిన టీఆర్ఎస్ పార్టీ విద్యార్థి విభాగం పట్టణ అధ్యక్షుడిగా తర్వాత ఖానాపూర్ ఇన్‌చార్జిగా అనంతరం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా నియమించింది. నాటి ఉద్యమ కాలం నుంచి నేటి వరకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, జోగు రామన్నతో సన్నిహతంగా ఉంటూ ఉన్నారు. తను నమ్ముకున్న బీఆర్ఎస్ పార్టీ సేవలందిస్తూ, పార్టీకి అండగా ఉంటానన్న ఉద్యమకారుడు ధరణి రాజేశ్ స్ఫూర్తిదాయకం.

## జొన్నల కొనుగోళ్లు చేపట్టాలి

బేల, జూన్ 1: ఆదిలాబాద్ జిల్లాలో నిలిచిపోయిన జొన్నల కొనుగోలు ప్రక్రియను ఇంకా కొద్ది రోజులు పొడిగించాలని సీపీఐ ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆదిలాబాద్ జిల్లా బేలలో సీపీఐ మహాసభలు నిర్వహించారు. మండల కేంద్రంలో నాయకులు ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.రైతులకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో రుణమాఫీతో పాటు రైతుభరోసా చెల్లించాలని కోరారు. మండలాభివృద్ధి చేపట్టాలని, అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా పండించిన జొన్న పంటను కొనుగోళ్లు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటి, రాములు, తదితరులు పాల్గొన్నారు.




బేలలో ర్యాలీ తీస్తున్న సీపీఐ నాయకులు

## ఎరువులు, విత్తనాల ఎంపికలో అప్రమత్తతే మేలు

దస్తురాబాద్, జూన్ 1 : వానకాలం పంట ప్రారంభమైయింది. సాగుకు సరిపడా వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో దుక్కి దున్ని సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు రైతులు పొలం బాట పట్టేదుందుకు సిద్ధమవుతున్నారు. సాగుకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసేందుకు రైతులు వ్యాపారులు సైతం విక్రయాలకు సిద్ధమయ్యారు. ఈ సమయంలో రైతులు విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు పాటించకపోతే మోసపోయే పరిస్థితి నెలకొంది. విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలి లేకుంటే నాణ్యత లేని విత్తనాలు అంటగట్టే పనిలో కొందరు వ్యాపారులు ఉంటారు. విత్తనాల స్థితిగతులను గమనించక రైతులు నష్టపోతారు. దీనిని దృష్టిలో పెట్టుకొని రైతులు ఎరువుల, విత్తనాలు, పురుగుల మందులు కొనుగోలు చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ అధికారులు, పోలీసులు సూచిస్తున్నారు. అధికారులు ఎరువుల దుకాణాల తనిఖీ చేపట్టారు. 2020 సంవత్సరంలో దస్తురాబాద్ మండలంలోని మల్లాపూర్ గొండుగూడెంలో వ్యవసాయ అధికారులు, పోలీసులు 286 నకిలీ పత్తి విత్తనాల ప్యాకెట్లు పట్టుకున్నారు.




ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

**రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు..**

- లైసెన్స్ లేని దుకాణాలు, వ్యక్తుల దగ్గర కొనుగోలు చేయవద్దు. • ప్రభుత్వం గుర్తించిన విత్తనాలు మాత్రమే కొనుగోలు చేయాలి. రైతులు వ్యవసాయ శాఖ ద్వారా లైసెన్స్ పొందిన డీలర్ వద్ద విత్తనాలు కొనుగోలు చేయాలి. • విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో బిల్లులో విత్తన రకం నంబర్, గడువు, కొనుగోలు తేదీ, డీలర్, రైతు సంతకం బిల్లులో ఉండే విధంగా చూసుకోవాలి.
- బిల్లులో విక్రయదారుడి పేరు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అమ్మకపు నంబర్, విత్తనాల ప్యాకెట్,డబ్బా, సంచిలపై సీల్ ఉందా లేదా అనేది నిర్ధారించుకోవాలి.
- తక్కువ ధరకు వస్తున్నాయని ప్రైవేట్ వ్యక్తుల వద్ద విత్తనాలు కొంటే మోసపోతారు.
- విత్తిన తర్వాత తప్పనిసరిగా విత్తన ప్యాకెట్లు, రసీదులు భద్రపర్చుకోవాలి. దీంతో నష్టపోయిన సమయంలో పరిహారం పొందేందుకు అవకాశం ఉంటుంది. • బిల్లులను పంట కాలం పూర్తయ్యే వరకు జాగ్రత్త భద్రపర్చుకోవాలి. • ఎరువుల నాణ్యతపై అనుమానం వస్తే వ్యవసాయ అధికారులకు చూపించి పరీక్షలకు పంపాలి. అన్యపదార్థాలు కనిపిస్తే ఆ ఎరువులను కల్తీలుగా గుర్తించాలి. • విత్తనాలను సాగు చేసిన అనంతరం మొలకెత్తే దశ , పూత దశలో లోపలు కనిపిస్తే, ఎరువుల వాడకంలో వ్యవసాయ అధికారులను సంప్రదించాలి.

### అనుమానం వస్తే సమాచారం అందించాలి



రైతులు విత్తనాలు, ఎరువులు తీసుకునే సమయంలో జాగ్రత్తలు పాటించాలి. నకిలీ విత్తనాలు కొని మోసపోవద్దు. నకిలీ విత్తనాలను అమ్మిన, కొన్న చట్టపరమైన నేరం. సమాచారం అందిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. మారుమూల ప్రాంత గ్రామాల్లోని రైతుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని నకిలీ విత్తనాలు అమ్మే అవకాశం ఉంది. గ్రామాల్లో ఎవరైనా ఎలాంటి అనుమతి లేకుండా విత్తనాలు, ఎరువులు అమ్మితే, అనుమానం వస్తే పోలీసులకు సమాచారం అందించాలి. లైసెన్స్ గల దుకాణాల్లోనే రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసి రసీదు తీసుకోవాలి. *-బీ.ప్రభాకర్ రెడ్డి, ఎస్ఐ, దస్తురాబాద్*

## పథకాలు సక్రమంగా అమలు చేయడం లేదు

ఎదులాపురం, జూన్ 1: భవన నిర్మాణ రంగ కార్మికులకు ప్రభుత్వం అందించే పథకాలు సక్రమంగా అమలు చేయడం లేదని విశ్రాంత లేబర్ అధికారి జగదీశ్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆదిలాబాద్‌లోని భవన నిర్మాణ కార్మిక సంఘ భవనంలో కార్మికులతో సమావేశం ఏర్పాటు చేసి వారి కోసం ఉన్న చట్టాలు తెలిపారు. ఈ సందర్భంగా విశ్రాంత కార్మిక అధికారి జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ గతంలో జిల్లాల్లోనే కార్మికులకు రావాల్సిన ఫలాలు సక్రమంగా వచ్చేవి అన్నారు. కానీ ఇప్పుడు పేమెంట్స్ లేట్ అవుతున్నాయని, కార్మిక శాఖ అధికారులు జవాబులు కూడా ఇవ్వడం లేదన్నారు. గతంలో ఉన్న విధంగా జిల్లా అధికారులకు పూర్తి బాధ్యతలు ఇచ్చి సంక్షేమ పథకాలను అమలు చేయాలన్నారు.. కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి పాత పద్ధతులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పోశన్న, కార్మికులు పాల్గొన్నారు.

## జొన్న రైతుల ఉసురుపోసుకుంటున్న కాంగ్రెస్

బజార్‌హత్నూర్, జూన్ 1: ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలంలోని రైతులు మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన జొన్న పంట డబ్బులు రైతుల ఖాతాల్లో జమ కాకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారని బీఆర్ఎస్ మండల కన్వీనర్ రాజారాం అన్నారు. ఆదివారం బజార్‌హత్నూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత నెల రోజుల కాలం గడిచిన ఇప్పటి వరకు జొన్న పంట డబ్బులు ఖాతాల్లో జమకాకపోవడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే వానకాలం సీజన్ ప్రారంభం కావడంతో పండించిన పంట డబ్బులతో అయినా గింజలు, మందులు కొనుగోలు చేదామంటే జొన్న పంట డబ్బుల పడలేక నానా తిప్పలు అవుతుందని వారు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా ఇవ్వక రైతులకు ఎగనామం పెడుతూ ఉంటే కనీసం అమ్ముకున్న పంట డబ్బులైన సరైన సమయంలో రైతుల ఖాతాల్లో జమచేస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండేవి కావని వాపోయారు. చేతకాని కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులు మళ్లీ అప్పులు చేసి గింజలు కొనుక్కునే పరిస్థితి తెచ్చిందన్నారు. ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు చొరవతీసుకొని జొన్న పంట డబ్బులు రైతుల ఖాతాల్లో జమ అయ్యే విధంగా చూడాలని కొరుతున్నారు. కార్యాక్రమంలో మాజీ నెట్‌క్యాప్ డైరెక్టర్ చిల్కూరి భూమయ్య, నాయకులు జనార్దన్, జ్ఞానేశ్వర్, అందె ప్రకాశ్, శరత్, నగేశ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండల కన్వీనర్ రాజారాం

## ఉపాధ్యాయుల సర్దుబాటు ఉత్తర్వులు విరమించుకోవాలి

నిర్మల్ చైన్‌గేట్, జూన్ 1 : ఉపాధ్యాయుల సర్దుబాటుకు సంబంధించి కలెక్టర్లకు అధికారమిస్తూ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ విడుదల చేసిన ఉత్తర్వులు వెంటనే విరమించుకోవాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ నిర్మల్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యర్శులు చంద్రనాగకాంత్, మహేంద్రచారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటిస్తూనే మరోవైపు పాఠశాలల్లో ఉపాధ్యాయుల సంఖ్య కుదింపునకు ఉత్తర్వులు జారీ చేయడం ఏమిటని ప్రశ్నించారు. వేసవికాలం అంతా ఉపాధ్యాయులు, అధికారులకు శిక్షణ, బడిబాట పేరుమీద అనేక కార్యక్రమాలు చేపడుతూనే మరోవైపు పిల్లలు తక్కువగా ఉన్నారనే ఉద్దేశంతో టీచర్లను వేరే పాఠశాలకు సర్దుబాటు చేయడం ద్వారా పాఠశాలలపై తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిపారు. ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వులను విరమించుకోకపోతే ఉద్యమ కార్యక్రమం చేపడుతామని పేర్కొన్నారు.



వర్షంతో కోతకు గురైన గిన్నేరా రోడ్డు

## కోతకు గురైన రోడ్డు

ఇంద్రవెల్లి,జూన్ 1: ఇంద్రవెల్లి మండలంలోని గిన్నేరాలో వరద నీటితో రోడ్డు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. ద్విచక్రవాహనాలు, ఆటోలు, ఇతర వాహనదారులు, ప్రయాణికులు, గ్రామస్తులు గ్రామం నుంచి మండల కేంద్రానికి రాకపోకలు చేసే సమయంలో ఏ మాత్రం నిర్లక్ష్యం వహించిన ప్రమాదం సంభవించే అవకాశం ఉంది. కోతకు గురైన రోడ్డుకు మరమ్మతులు చేయాలని అధికారులకు విన్నవించిన పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ దృష్టి సారించి కోతకు గురైన రోడ్డుకు మరమ్మతులు చేసి గ్రామస్తులకు ప్రమాదం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## నాణ్యమైన విత్తనం లాభాసాటి వ్యవసాయానికి సోపానం

నిర్మల్ చైన్‌గేట్, జూన్ 1 : నాణ్యమైన విత్తనం లాభసాటి వ్యవసాయానికి సోపానమని ఆదిలాబాద్ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ రాంప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ వ్యవసాయ విద్యాలయం, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పంటల సాగులో గ్రామగ్రామాన నాణ్యమైన విత్తనం రైతన్నకు నేస్తం అనే కార్యక్రమం చేపట్టిందని దానిలో భాగంగా గ్రామ గ్రామాన నాణ్యమైన విత్తన పంపిణీ కార్యక్రమాన్ని ఎంపిక చేసి రైతులకు కొద్ది మొత్తంలో పంపిణీ చేయబోతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జూన్ 2న ప్రారంభిస్తామని తెలిపారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని అన్ని రెవెన్యూ గ్రామాల్లో వ్యవసాయ పరిశోధన స్థానాల ద్వారా ఉత్పత్తి చేయబడిన నాణ్యమైన విత్తనాన్ని ఎంపిక చేయబడిన ముగ్గురి నుంచి ఐదుగురు అభ్యుదయ రైతులకు అందజేయబడుతుందని తెలిపారు. ఈ నాణ్యమైన విత్తనాన్ని రైతులు సాగు చేసి తదుపరి పంట ద్వారా ఉత్పత్తియైన విత్తనాన్ని తోటి రైతులకు తక్కువ ధరకే అందించాలనేది ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు.